

సిపిఎం ఆధ్వర్యాన 16న సదస్సు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు, కీర్తిశేషులు వాసంశెట్టి సూర్యారావు 6వ వర్థంతి సందర్భంగా మార్చి 16న మంచి ఆహారపు అలవాట్లు, శరీర, అవయవ దానం ప్రాధాన్యతపై సదస్సు నిర్వహిస్తున్నట్లు రూరల్ కమిటి కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సూర్యారావు జీవిత కాలం ప్రజాసేవకు అంకితమై అనేక కార్మిక, ఉద్యోగ సంఘాల ఉద్యమాలు నిర్వహించారని అన్నారు. ఆయన మరణానంతరం ఆయన కోరికపై వైద్య విద్యార్థుల విద్యా పరిశోధనల కోసం ఆయన దేహాన్ని స్థానిక వైద్య కళాశాలకు అందజేశారని తెలిపారు. మరణాంతరం శరీర అవయవ దానం ప్రాధాన్యతపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'ఒంటిపూట' నిబంధనలకు నీళ్లు

-ఇష్టారాజ్యంగా ప్రయివేటు యాజమాన్యాలు
-రోజంతా తరగతుల నిర్వహణ
-ఉక్కపోత,ఎండలకు అల్లాడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మండుతున్న ఎండల నేపథ్యంలో ప్రభుత్వం ఈనెల 15 నుంచి ఒంటి పూట సెలవులు ప్రకటించింది. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాలు తప్పనిసరిగా ఈ నిబంధనలను పాటించి మధ్యాహ్నం 12:30 వరకు మాత్రమే విద్యాసంస్థలను నడపాలని ఆదేశించింది. కానీ జిల్లాలో పలు ప్రయివేట్ యాజమాన్యాలు ప్రభుత్వం విధించిన నిబంధనలను పక్కనపెట్టి శనివారం రోజంతా పాఠశాలలను నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు ఏర్పాటు చేసి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేశారు. ఇప్పటికే ఎండలకు తీవ్రత బాగా పెరిగింది. గరిష్ట ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎండలు, తీవ్ర ఉక్కబోతతో విద్యార్థులు అల్లాడుతున్న పరిస్థితి ఏర్పడింది.

ఈ ఏడాది జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో ఈనెల 15వ తేదీ నుంచి 'ఒంటి పూట బడులు' ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు కొనసాగుతాయని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయ్ రామరాజు ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఒక పూట మాత్రమే పాఠశాలలను తెరవాల్సి ఉంటుందని అయన తెలిపారు. విద్యా శాఖ నిబంధనలను పాటించని ప్రయివేట్, కార్పొరేట్ విద్య సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఇఒ హెచ్చరించారు. జిల్లాలో 1280 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిల్లో సుమారు 1.39



పిఠాపురంలో సాయంత్రం 5 తరువాత బయటకు వస్తున్న విద్యార్థులు

లక్షల మంది 1 నుంచి 10 తరగతి వరకూ పిల్లలు చదువుతున్నారు. అలాగే దాదాపు 600 వరకూ ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 1.20 లక్షల మంది విదానభ్యసిస్తున్నారు. వీరందరికి 'ఒంటి పూట' వర్తిస్తుంది. ఒంటిపూట బడులపై సమయ పట్టికను తప్పనిసరిగా అన్ని పాఠశాలలు అమలు చేయాల్సి ఉంటుంది. వేసవి ఎండల దృష్ట్యా పాఠశాలల్లో మంచినీటిని అందుబాటులో ఉంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ తరగతులను ఆరుబయట, చెట్లకింద నిర్వహించరాదని నిబంధన విధించారు. విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా స్కూళ్లలో ఓరల్ రీ-హైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్) ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశాలిచ్చారు. మధ్యాహ్న భోజనాన్ని ఒంటిపూట బడి సమయం ముగిసేలోగా తయారు చేయించి విద్యార్థులకు అందించాల్సి ఉంటుంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉదయం 7-45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు 6 పీరియడ్లు జరపాలని ఆదేశించారు.

ప్రయివేటు ఇష్టారాజ్యం

మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఒంటి పూట సెలవులను ఇస్తోంది. అయితే ఈ ఏడాది ఇప్పటికే సెలవులు ప్రారంభం కాగా పలు ప్రయివేట్ విద్యాసంస్థలు తమ ఇష్టారీతిన వ్యవహరించాయి. కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, తుని తదితర ప్రాంతాల్లో కొన్ని విద్యాసంస్థలు ప్రభుత్వం నిబంధనలను తుంగలోకి తొక్కి సాయంత్రం వరకు బడులు నిర్వహించడం శోచనీయమని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 7.30 గంటలకే స్కూలుకు వచ్చే విద్యార్థులు, టీచర్లు సాయంత్రం 5 గంటల వరకు ఉక్కపోతలో ఉండాల్సి వస్తుంది. ప్రభుత్వ ఆదేశాలను అన్ని ఎయిడెడ్, మునిసిపల్ ప్రభుత్వ పాఠశాలలు ఒంటి పూట నిర్వహిస్తుంటే పలు ప్రయివేటు పాఠశాలలు రెండు పూటలా తరగతులు నిర్వహిస్తూ ఉండడంపై విద్యార్థి సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం దూర ప్రాంత విద్యార్థులు ఉదయం 11.30 గంటల తరువాత ఎండలో ఇళ్లకు వెళ్లేందుకు ఆసక్తి కనబరచకపోతే వారు సాయంత్రం వరకు స్కూలులో విశ్రాంతి తీసుకుని, తరువాత ఇంటికి పంపించాలని ఒక సూచన ఉంది. దీనిని ఆసరాగా చేసుకుంటూ కొన్ని విద్యాసంస్థలు సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. పలుచోట్ల సాయంత్రం 5 గంటల వరకు ఉక్కపోతలోనే తరగతులు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. దీనిపై ఫిర్యాదులు అందినా జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం విశేషంగా కనిపిస్తోంది. ప్రయివేటు విద్యా సంస్థలకు వత్తాసు పలికేలా విద్యాశాఖ తీరు ఉందని తల్లిదండ్రులతో పాటు విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం నిబంధనలను పక్కాగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.





జడ్‌పి సమావేశాన్ని ప్రారంభిస్తున్న ఛైర్మన్ వేణుగోపాల్, సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఐవి

మొక్కుబడిగా జడ్‌పి సమావేశం

-మంత్రులు, అధికారులు డుమ్మా -అరకొర అంశాలకే పరిమితం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జడ్‌పి బడ్జెట్, సాధారణ సమావేశాలు ఈసారి కూడా మొక్కుబడి తంతుగానే ముగిశాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు గానీ, కొందరు కీలక శాఖల అధికారులకు గాని హాజరు కాక పోవడంతో సభ్యులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీంతో సమావేశం కొన్ని అంశాలకే పరిమితం కాగా మధ్యాహ్నం తర్వాత ముగించేశారు. ఎంఎల్‌సిలు ఐ.వెంకటేశ్వరరావు, తోట త్రిమూర్తులు వంటి వారు అడిగిన ప్రశ్నలకు అధికారులు సరైన సమాధానం చెప్పకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఎల్‌సి ఐవి వెయిటింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు గురించి ప్రశ్నించారు. జిల్లాలో 91 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉందని, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు అంగీకరిస్తే వెంటనే ఇస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా వెయిటింగ్‌లో ఉన్న 2500 మందికి ఇతర ప్రభుత్వ శాఖలలో కారుణ్య నియామకాలు ఇచ్చే దానికి సంబంధించిన ఫైలు సిఎంకి వెళ్లినట్లు జడ్‌పి సిఇఒ తెలిపారు. జడ్‌పి, మండల పరిషత్ ఉపాధ్యాయులకు 2023 -24 పిఎఫ్ స్లిప్పులు వెంటనే విడుదల చేయాలని కోరగా ఏప్రిల్ 25 నాటికి విడుదల చేస్తామని సమాధానం ఇచ్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు సమస్యలను సమావేశం దృష్టికి ఐవి తీసుకొచ్చారు. సమావేశాలకు ముఖ్య అధికారులు హాజరు కాకపోవడంపై ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల కలెక్టర్లు, హాజరు కాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. గత సమావేశంలో కూడా దీనిపై తాను ప్రశ్నించినా సరైన సమాధానం రాలేదన్నారు. దీనిపై కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ఇద్దరు కలెక్టర్లు సమావేశానికి హాజరు కాకపోవడంపై వివరణ ఇచ్చారు.

బడ్జెట్‌కు ఆమోదం

2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.70 లక్షలు మిగులుతో రూ.1014 కోట్ల బడ్జెట్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సభ్యులు ఆమోదించారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 2024-25 సంవత్సరానికి సవరించిన బడ్జెట్‌ను, 2025-26 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను చర్చించి ఆమోదించారు. 2024-25 సంవత్సరానికి సవరించిన ఆదాయం రూ.846.60 కోట్లు, సవరించిన వ్యయం రూ. 845.95 కోట్లతో రూ.65 లక్షల మిగులుతో రివైజ్ బడ్జెట్‌ను ఆమోదించారు. అలాగే రానున్న 2025-26 ఆర్థిక సంవత్సరానికి అన్ని పద్దులు కలుపుకుని మొత్తం ఆదాయ అంచనా రూ.1013.80 కోట్లు కాగా, అన్ని పద్దుల కింద అంచనా వ్యయం రూ.1013.10 కోట్లతో, రూ. 70 లక్షలు మిగులు బడ్జెట్ ను సర్వ సభ్య సమావేశం ఆమోదించింది. ఆదాయంలో జడ్‌పి సాధారణ నిధులు రూ.28 కోట్లు, ప్రభుత్వం నుంచి కేటాయించే శాలరీ గ్రాంటులు రూ.10.48 కోట్లు, నిర్దిష్ట ప్రయోజన గ్రాంట్లు రూ.46.09 కోట్లు, డ్వామా, గ్రామీణ నీటి సరఫరా, ఇతర శాఖల ద్వారా వచ్చే గ్రాంట్లు రూ.922.39 కోట్లుగా ఉన్నాయి. జడ్‌పి సాధారణ నిధుల నుంచి షెడ్యూల్ కులాల సంక్షేమానికి 15 శాతం కేటాయింపులో భాగంగా రూ.2.97 కోట్లు, షెడ్యూల్ తెగల సంక్షేమానికి 6 శాతం కేటాయింపులో భాగంగా రూ.1.19 కోట్లు, మహిళా శిశు సంక్షేమానికి 15 శాతం కేటాయింపులో భాగంగా రూ. 2.97 కోట్లు, అభివృద్ధి పనులకు 23 శాతం కేటాయింపులను సమావేశం ఆమోదించింది. ఈ సమావేశంలో జడ్‌పి వైస్ ఛైర్మన్లు బుర్రా అను బాబు, మెరుగు పద్మలత, సిఇఒ వివివి ఎస్.లక్ష్మణ రావు, డిప్యూటీ సిఇఒ రామ్‌గోపాల్, ఎఒ ఎం.బుజ్జి బాబు, జడ్‌పిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

అధికారులు, నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, రైతుల సమన్వయంతో నీటి ఎద్దడి నివారణకు చరక్యలు చేపడుతున్నట్లు ఇరిగేషన్ ఇఇ వి.రామకృష్ణ తెలిపారు. శనివారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయం వద్ద డిసి ఛైర్మన్ వేగేశ్న భాస్కరరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నేటికీ సుమారు 150 ఎకరాల వరకు నీటి ఎద్దడి పరిస్థితి ఉందని అన్నారు. మండల సాగు నీటి సమస్య నివారణకు ఒఎన్‌జిసి సహకారం అందించాలని కోరామని తెలిపారు. పి.మల్లవరం గ్రాంటులో నీటి ఎద్దడితో ఉన్న పంట పొలాలకు ఒఎన్‌జిసి పైప్‌లైన్ ద్వారా శనివారం నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. మసకపల్లి లాకుల నుంచి తాళ్లరేవు సెక్షన్‌కు వంతు నడుస్తుందని, అయితే ఈ విధానాన్ని మరో మూడు రోజులు పొడిగించినట్లు తెలిపారు. శాశ్వతంగా నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని డిసి ఛైర్మన్ భాస్కరరాజు కోరారు. ఈ కార్యక్రమంలో డిఇ పోచారావు, ఎఇ అనూష, నీటి సంఘాల అధ్యక్షులు అల్లూరి రామకృష్ణరాజు, ధూళిపూడి గోపి, రైతులు మొగలతుర్తి శ్రీనివాసరావు, రాయుడు వీర్రాజు, పేరాబత్తుల సాయినరేంద్ర, బాదం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఇఇ రామకృష్ణ

ఆంధ్రాలో మత విద్వేషాలకు తెరలేపకండి

ప్రజాశక్తి - కాకినాడ

పవిత్ర రంజాన్ నెలలో ఆంధ్రాలో లేని మత జాడ్యాన్ని తెరలేప వద్దని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు ముస్లిం ఆలోచన పరుల వేదిక కో కన్వీనర్ హసన్ షరీఫ్ శనివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జనసేన ఆవిర్భావ సభలో పవన్ కల్యాణ్ డిప్యూటి సిఎం అన్న సంగతి పక్కన పెట్టి మాట్లాడినట్లు తెలుస్తోందన్నారు. సమాజంలో అనేక సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో చర్చకు తేవాల్సిన అనేక విషయాలను విస్మరించి పక్క రాష్ట్రంలో ఒక నాయకుడి కోసం పక్క రాష్ట్రాల భాష ఉద్యమం కోసం మాట్లాడి కార్యకర్తలను రెచ్చగొట్టేలా మత పరమైన ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో శుక్రవారం రోజు, అలాగే హోలీ పండుగ రోజు ఎంతో శాంతియుత వాతావరణంలో అందరూ కలిసి నిర్వహించుకున్నారని, ఈ సమయంలో అనాలోచిత ప్రకటనలు సరికాదన్నారు.



రైతుకు బహుమతి అందిస్తున్న ఎంపిపి బుజ్జి

పంటలతో పాటు పాడి అవసరం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రైతన్నలకు అదనపు ఆదాయాన్నిచ్చే పాడి ఎంతో అవసరమని ఎంపిపి గొల్లపల్లి బుజ్జి అన్నారు. మండలంలోని ఎర్రవరం గ్రామంలో పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి శాఖ శనివారం నిర్వహించిన లేగ దూడల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటి ద్వారా రైతన్నలకు పాలు మాత్రమే కాకుండా పొలానికి అవసరమైన సేంద్రియ ఎరువు లభిస్తుందన్నారు. ప్రత్తిపాడు పశువైద్య సంచాలకులు డాక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్ మాట్లాడుతూ లేగ దూడల ప్రదర్శనకు 40 మంది రైతులు తమ దూడలను తీసుకురావడం జరిగిందన్నారు. ప్రథమ బహుమతి రైతు కరణం వెంకటేశ్వర్‌రావు, ద్వితీయ బహుమతి తోట అబ్బాయి, తృతీయ బహుమతి అడ్డాల వీరబాబులకు చెందిన దూడలు ఎంపిక య్యాయన్నారు. ఈ శిబిరంలో దూడలకు బృసెల్లా వ్యాక్సిన్, క్యాల్షియం, లివర్ టానిక్స్, మినరల్ బ్లాక్స్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, కూటమి నాయకులు బి.ప్రసాద్, ఎం.కనకారావు, టి.దుర్గారావు, వైద్యులు డాక్టర్ ఎస్.వరలక్ష్మి, డాక్టర్ ఇ.సతీష్‌కుమార్, డాక్టర్ పిఎన్ఎస్.మంజుష, డాక్టర్ టివి.కళ్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మండల పరిధిలోని వలసపాకల గ్రామంలో బిసి కాలనీ లో వోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు కోరారు. శనివారం వలసపాకల గ్రామంలో సిపిఎం ప్రజాచైతన్య యాత్ర జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని బిసి కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సిపిఎం బృందం దృష్టికి తెచ్చారు. లో వోల్టేజీ సమస్యతో గృహాల్లో ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోతున్నాయని, విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాఉ. కాలనీలో దోమల ఎక్కువగా ఉండటం వల్ల తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నామని తెలిపారు. ప్రతివారం దోమల మందు స్ప్రే చేయించాలని కోరారు. ఈ సందర్భంగా రూరల్ మండల కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు, నాయకులు తొట్టిపూడి రాజా, చింతపల్లి అజయ్‌కుమార్ మాట్లాడుతూ బిసి కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాడుతామన్నారు. 200 కుటుంబాల ప్రజలు లో వోల్టేజ్ సమస్యతో బాధపడుతున్నామని చెప్పినా విద్యుత్ శాఖ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. గ్రామాల్లో రోడ్లు వేసి డ్రెయినేజీలు వదిలేశారని విమర్శించారు. తక్షణమే డ్రెయినేజీలు నిర్మించడంతోపాటు, కల్వర్టులు నిర్మించాలని డిమాండ్ చేశారు. వంగిపోయిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. లో వోల్టేజ్ సమస్యపై రమణయ్యపేట డి సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ జి.రాజుకి వినతి పత్రం అందజేశారు. దీనిపై ఎఇ రాజు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు రేవు సురేష్, ఒ.శ్రీను, పి.సతీష్, ఎం.ఆనంద్, పి.కామేశ్వరి, పి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో నాయకులు

పదో తరగతి పరీక్షలకు ఏర్పాటు పూర్తి

ప్రజాశక్తి - యంత్రాంగం

గండేపల్లి మండలంలో ఈ నెల 17వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ కెహెచ్.నాయక్ తెలిపారు. శనివారం అన్ని సెంటర్ల లోనూ ఇన్విజిలేటర్లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పదో తరగతి పరీక్షలు 3 కేంద్రాల్లో జరుగుతాయని తెలిపారు. స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో 183 మంది, మల్లేపల్లిలోని జడ్‌పి పాఠశాలలో 180 మంది, తాళ్లూరు జడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగే పరీక్షలకు 161 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ పరీక్షలు నిర్వహణ ఉంటుందన్నారు. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లును పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే సామర్లకోట మండల పరిధిలో జరిగే 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఇఒ వై.శివరామకష్ణయ్య చెప్పారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 2310 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, వీరి కోసం 10 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ హాల్ టికెట్లతో గంట ముందు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఓపెన్ స్కూల్ 10 తరగతి పరీక్షలకు 290 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, వారి కోసం 3 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్టు వివరించారు. పెద్దాపురం మండల పరిధిలో 1598 మంది రెగ్యులర్ విద్యార్థులు, 207 మంది ప్రయివేట్ విద్యార్థులు, 100 ఓపెన్ స్కూల్ విద్యార్థులు వెరసి 1805 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఎంఇఒ విఆర్‌కె.చౌదరి తెలిపారు. రూరల్ పరిధిలో చంద్రమాంపల్లి, రాయ భూపాలపట్నం, కట్టమూరు, పట్టణ పరిధిలో జవహర్లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, సాగర్ మున్సిపల్ హై స్కూల్, ఆర్‌కె స్కూల్, ఆదిత్య స్కూల్స్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.



గండేపల్లిలో మాట్లాడుతున్న ఎంఇఒ నాయక్

68 శాతం పన్నుల వసూలు

ప్రజాశక్తి - పెద్దాపురం

డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో 68 శాతం పన్నుల వసూళ్లు జరిగాయని డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో రూ.20, 02,22,000 పన్నుల డిమాండ్ ఉండగా ఇప్పటివరకు రూ.11,09,31,000 పన్నుల వసూలు జరిగిందని అన్నారు. ఈనెల 17వ తేదీ నాటికి 80 శాతం, ఈ నెలాఖరునాటికి నూరు శాతం పన్నుల బకాయిల వసూలుకు డివిజన్ పరిధిలో సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. కోర్టు కేసుల పెండింగులో పెద్దాపురం మండలం జి.రాగంపేట పరిధిలోని ఒక పరిశ్రమ రూ.17 లక్షలు, తుని మండలం రాజుపేటలో శ్రీప్రకాష్ విద్యా సంస్థ రూ.39.96 లక్షల బకాయిలు ఉన్నాయన్నారు.



బాలామణి

వినియోగదారుల హక్కులపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ట్రినిటీ స్కూల్లో వినియోగదారుల హక్కులపై అవగాహనా సదస్సు నిర్వహించారు. వినియోగదారుల సంఘం అధ్యక్షులు బళ్ళమూడి సూర్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తూనికలు- కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ వి.మోహన్ పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత జీవన విధానానికి వినియోగ వస్తువులు పెరుగుతున్నాయన్నారు. ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేసినప్పుడు ఐఎస్ఐ మార్కు, బంగారు వస్తువులు కొన్నప్పుడు హాల్ మార్క్ గమనించాలన్నారు. రసీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వారంటీ లోపులో ఎటువంటి తేడాలు వచ్చినా జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కులు, సమస్యలపై విద్యార్థులను ప్రశ్నించి సరైన సమాధానాలు చెప్పిన వారికి ప్రశంసా పత్రాలు, మేలుకొలుపు మాసపత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఒ విజయకుమారి, వినియోగదారుల సంఘ సభ్యులు ఎం.భాస్కరరావు, వి.శ్యామల, కె.లక్ష్మి, హెచ్‌ఎం భరత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతిని అందిస్తున్న సూర్యనారాయణమూర్తి

17 నుంచి ఛాంపియన్‌షిప్ పోటీలు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఆదిత్య ప్రో కార్టింగ్ ఎండురన్స్ ఛాంపియన్ షిప్ 2025 సీజన్ 5 పోటీలు ఈ నెల 17 నుంచి 19వరకూ జరుగుతాయని ఆదిత్య ప్రో -ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. శనివారం పోటీలకు సంబంధించిన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో ఎపితోపాటు, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు పాల్గొంటాయని తెలిపారు. ఛాంపియన్ షిప్‌లో విజేతకు రూ.4 లక్షల నగదు బహుమతి అందిస్తామని తెలిపారు

కార్టూ'నిజం'



పలుచోట్ల స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ నుంచి కొండయ్యపాలెం వరకూ సైకిల్ ర్యాలీని ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, జిల్లా ఇన్‌ఛార్జ్ అధికారి జి.వీరపాండ్యన్, కలెక్టర్ షాన్ మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరపాండ్యన్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాయని అన్నారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థులు పరిశుభ్రతను అలవాటుగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ జిల్లాలో ఈకార్యక్రమం ప్రతి నెల 3వ శనివారం సక్రమంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతినెల ఒక ప్రత్యేక అంశంపై కార్యక్రమాన్ని తీసుకుని దానిని పాటించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వాడడం తగ్గించడంపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్.భావన, డిఎంహెచ్ఒ డాక్టర్ జె.నరసింహనాయక్, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, మున్సిపల్ అదనపు కమిషనర్ కెటి.సుధాకర్, టౌన్ ప్లానింగ్ అధికారి రామకృష్ణ, ఎంహెచ్ఒ పృథ్వీ చరణ్, తదితరులు పాల్గొన్నారు. **రౌతులపూడి** మండలంలోని ఎ.మల్లవరంలో నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో ఎంపిడిఒ శివరామకృష్ణయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గౌతమ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. **శంఖవరం** అన్నవరంలో నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్-ఎస్.శర్మ, సర్పంచ్ కుమార్‌రాజా, పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి పాల్గొని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. దుకాణాల్లో ప్లాస్టిక్ విక్రయిస్తున్న కొన్ని షాపులకు నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ పద్మావతి, ఉప సర్పంచ్ వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు. **కరప** మండలంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఇఒపిఆర్‌డి సలాది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి నిర్మలాదేవి, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి.వీరభద్రరావు, బ్రహ్మానందం, వరిజ, రాంజీ, సుధారాణి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక నెంబర్ టు మార్కెట్ వద్ద స్వచ్ఛతా కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగ నిషేధంపై ప్రజల అవగాహన కలిగి ఉండాలన్నారు. మెప్మా ఆధ్వర్యంలో గుడ్డ సంచులను వ్యాపారులకు, ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. స్వచ్ఛత కార్యక్రమంపై ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కాదా హిమమహేశ్వరి, పట్టణ టిడిపి అధ్యక్షులు అడబాల కుమారస్వామి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** మండలంలోని సిరిపురం గ్రామంలో స్వచ్ఛత ఆంధ్రా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పీతల నూకరాజు పాల్గొని మాట్లాడారు. ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. దుకాణాలలో ప్లాస్టిక్ కవర్లు వాడకూడదని పంచాయితీ కార్యదర్శి సత్యనారాయణ నోటీసులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కొల్ల శ్రీనివాసరావు, చిలకమర్తి ఆదినారాయణ, బచ్చల నాగ శివ, కాకర జార్జి,వనుం శ్రీను, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రాంబాబు పాల్గొని స్వచ్ఛతా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు గుడ్డ సంచులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రఘు, కె.శ్రీనివాసరావు, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు. **గండేపల్లి** మండలంలో ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఆయా గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివాస్ కార్యక్రమాలు జరిగాయి. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ నాతి బుజ్జి, తహాశీల్దార్ శ్రీనివాస్, ఎంఇఒ నాయక్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఒ కె.చంద్రరావు, పంచాయతీ కార్యదర్శులు ఫణీంద్రకుమార్, తరంగిణి, పోతులు శిరీష, సిబ్బంది పాల్గొన్నారు



సామర్లకోటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప



అన్నవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు, సిబ్బంది



కాకినాడలో సైకిల్ ర్యాలీలో ప్రత్యేకాధికారి వీరపాండ్యన్, కలెక్టర్, జెసి

విషాదభరితం చిన్నారుల హత్యోదంతం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

అభం శుభం తెలియని ముక్కు పచ్చలారని ఇద్దరు చిన్నారులను అతి పాశవికంగా కళ్లకు గంతలు కట్టి, కాళ్లకు తాడు కట్టి, రెండు చేతులను వెనక్కి వంచి కదలకుండా చేసి బకెట్లలలో నీటిలో ముంచి ఊపిరి ఆడకుండా చేసి హతమార్చాడు. ఇంతటి దారుణానికి ఒడి కట్టింది ఎవరో ప్రొఫెషనల్ కిల్లర్ కాదు. సాక్షాత్తూ చిన్నారులకు జన్మ నిచ్చిన కన్నతండ్రే.. ఆ తర్వాత తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు అవాక్కయ్యారు. నీటి తొట్టెలో ముంచి చంపిన దశ్యం చూచి చలించిపోయారు. శనివారం కాకినాడ జిజిహెచ్‌లో ఇద్దరు చిన్నారులు, మతుడు చంద్రకిషోర్ మతదేహాలకు వైద్యులు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు మతదేహాలను అప్పగించారు. సర్పవరం ఎస్‌హెచ్‌ఒ బి.పెద్దిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రొఫెషనల్ కిల్లర్‌గా మారిన తండ్రి

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన వానపల్లి చంద్రకిషోర్ (37) ఎంకామ్ చేసిన అనంతరం ఎంబిఎ ఉన్నత విద్యాభ్యాసం చేశాడు. కాకినాడ అర్బన్ 2వ డివిజన్ తోట సుబ్బారావునగర్ రోడ్డు నెంబర్ -2, రామానాయపేట భూదేవి అపార్టుమెంట్లో త్రిబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లో నివాసం ఉంటున్నాడు. ఇతనికి ఏడేళ్ల కిందట తనూజాతో పెద్దలు వివాహం జరిపించారు. వీరికి ఆరేళ్ల వానపల్లి జోషిల్, అయిదేళ్ల నిఖిల్ కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడ్ని కాకినాడలో ప్రముఖ స్కూల్లో ఎల్‌కెజిలో చేర్పించగా యుకెజి వరకూ అందులోనే ఉంచారు. ఫీజు లక్షల్లో ఉండటంతో గతేడాది ఏడాదికి రూ.50 వేలు ఫీజు ఉండే స్కూల్లో ఇద్దర్నీ రూ.లక్ష కట్టి జాయిన్ చేశాడు. పెద్దస్కూల్ నుంచి చిన్నస్కూల్లోకి మార్చేశాను, భవిష్యత్తులో లక్షలు కట్టి పిల్లల్ని చదివించగలనా, స్థాయి తగ్గించేశానా అనే ఆలోచన చంద్రకిషోర్ ఎవరికీ చెప్పలేక ఆత్మన్యూనతా భావానికి లోనై క్షణికా వేశంలో ముక్కుపచ్చలారని ఇద్దరు పిల్లల్ని కర్కసంగా కళ్లకు గంతలు కట్టి, కాళ్ల, చేతులు కదలకుండా రెండు ప్లాస్టిక్ బకెట్లలలోనీరు పోసి అందులో ముంచేసి ఊపిరి ఆడకుండా చేసి మరీ హత్య చేసి, తానూ కూడా ఆత్మహత్య చేసుకున్నాడు.

గొల్లపేటలో చోరీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరంలో వరుస దొంగతనాలతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. కొన్ని రోజుల క్రితం వృద్ధిరాలి మెడలో గొలుసు అపహరించిన సంఘటన మరువకముందే ధవళేశ్వరంలోని జిటిపిఎస్ క్వార్టర్స్ వెనకాల గొల్లపేటలో చోరీ చోటు చేసుకుంది. ఇంటి యజమాని చొప్పర హరీష్ గురువారం ఊరు వెళ్లారు. తిరిగి శనివారం మధ్యాహ్నం వచ్చి చూడగా తలుపు గెడ పెకలించి ఉండడంతో అనుమానం వచ్చి వెనక వైపు చూడడంతో తలుపు తెరచి ఉంది. దీంతో ధవళేశ్వరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిఐ టి.గణేష్, ఎస్ఐ క్రాంతి సంఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లో బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో ఉన్న వెండి వస్తువులు, నగదు, స్మార్ట్ టీవీ అపహరించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ధ్యాన సదస్సు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక బీచ్ రోడ్‌లో గల శిల్పారామంలో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మౌన ధ్యానం - ఆత్మజ్ఞాన సదస్సు జరుగనుందని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగనున్న ఈ కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్ పుష్ప పాల్గొంటారని తెలిపారు.

పరీక్షా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రూరల్ గ్రామాలకు చెందిన 10వ తరగతి పరీక్షలకు సిద్ధమౌతున్న విద్యార్థులకు పెద్దనాపల్లి సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్షల సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ రూరల్ ప్రాంతాల నుంచి 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచే విద్యార్థికి రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచే విద్యార్థికి రూ.7,500, తృతీయ స్థానాల్లో విద్యార్థికి రూ.5 వేలు అందజేయడం జరుగుతుందన్నారు.

వైసిపికి కార్యకర్తలే బలం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

వైసిపికి కార్యకర్తలే బలమని నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. శనివారం ఆయన మండలంలోని రాచపల్లి గ్రామంలో వైస్ ఎంపిపి బంక్ శ్రీను కార్యాలయంలో కార్యకర్తలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పార్టీకి ఇంతమంది కార్యకర్తలు ఉండటం ఆనందకరమని అన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రామిశెట్టి నాని, సారిపల్లి గంగరాజు, పెద్దిరెడ్డి నాని, సారిపల్లి గోవింద్, మరోతు బాజ్జీ, ఒమ్మి రమణ పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

మెప్మా ఆధ్వర్యంలో ట్రయాంగిల్ సంస్థ ద్వారా ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, కార్పెంటర్లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయా వృత్తుల కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఎలక్ట్రికల్ శిక్షకులు చింతల సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో కార్పెంటర్ వేముల అర్జునరావు అధ్యక్షతన జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 8 రోజుల పాటు జరిగే ఈ శిక్షణా తరగతులు ఈనెల 18వ తేదీతో ముగిస్తాయన్నారు. శిక్షణ పొందిన కార్మికులకు సర్టిఫికెట్‌తో పాటు రూ.4 వేలు విలువచేసే పనిముట్ల అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తాడిశెట్టి గంగ, లంక చంటి, తదితరులు పాల్గొన్నారు.

240 కంపోస్ట్ పిట్లు మంజూరు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 23 గ్రామాల్లో 240 కంపోస్టు పిట్లు మంజూరయ్యాయని ఎంపిడిఒ డి.శ్రీ లలిత తెలిపారు. శనివారం ఆమె డిఎల్‌డిఒ కెఎన్‌వి.ప్రసాదరావు తో కలిసి పలు గ్రామాల్లో పారిశు ధ్య నిర్వహణ పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాలలో పశువుల పెంపకం వల్ల వచ్చే చెత్తను ఈ పిట్లు ద్వారా భద్రపరిచి ఎరువుగా మార్చేందుకు అవకాశం ఉంటుందన్నారు.

విద్యుత్ ఛార్జీల మోత..కోతల వాత...

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

విద్యుత్ బిల్లులు మోత మోగుతున్నాయి. ట్రూ అప్, సర్ ఛార్జీలు తదితర పేర్లతో విద్యుత్ సంస్థలు యథేచ్ఛగా వసూళ్ళ చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసిన విషయం విధితమే. దీంతో బిల్లులు ఆకాశాన్నంటుతున్నాయి. సాధారణంగా ప్రతి నెలా రూ.900 నుంచి రూ.1000 చెల్లించే గృహ వినియోగదారులు రూ.1500లకు పైగా బిల్లులు వచ్చాయి. షాపింగ్ మాల్స్, సినిమా ధియేటర్లు, పరిశ్రమల యజమానులు ప్రభుత్వం చుక్కలు చూపిస్తుందంటూ వాపోతున్నారు. మరోవైపు పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవటతో విద్యుత్ కోతలు అనివార్యంగా మారాయి. దీంతో పల్లెలతో మొదలైన విద్యుత్ కోతలు ప్రస్తుతం పట్టణాల్లోనూ ఎడా పెడా అమలవుతోంది. దీంతో ఉక్కపోత.. ఉమ్మదీతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు ఆక్వా రంగానికి విద్యుత్ కోతలు శాపంగా మారాయి. చేపలు, రొయ్యలను బ్రతికించుకునేందుకు లక్షలు వెచ్చించి డీజిల్ మోటార్లతో ఏరియేటర్లతో ఆక్సిజన్ అందిస్తున్నామంటూ నిర్వహకులు వాపోతున్నారు. ప్రజల, అవసరాలకు తగ్గట్లుగా సరఫరా అందించటంలో పాలకులకు చిత్తశుద్ధి కొరవడిందని, బిల్లుల వసూళ్ల పేరుతో వినియోగదారుల గోళ్లూడ పీకుతున్నారనే అభిప్రాయం వ్యక్తవవుతోంది.

రహదారుల రక్త సిక్తం...

జాతీయ రహదారులు అంతర్జాతీయ స్థాయిలో ఆధునీకరణ తమ హయాంలోనూ జరుగుతోందంటూ ప్రకటనలు గుప్పిస్తున్న కేంద్ర ప్రభుత్వ డొల్లతనానికి రోడ్డు ప్రమాదాలు దర్పణం పడుతున్నాయి. జిల్లాలో అనేక రహదారులు రక్త సిక్తంగా మారుతున్నాయి. గత నెలలో రాజమహేంద్రవరంలో ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొని ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన మరవక ముందే ఏలూరులో ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఆగిఉన్న లారీని ఢీ కొట్టడంతో కాకినాడకు చెందిన ప్రయాణీకులు మృతి చెందారు. అదే విధంగా నల్లజర్ల హైవేపై రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఇటువంటి ఘటనలు చోటు చేసుకున్నపుడు రోడ్డుపై లారీ నిలిపిన డ్రైవర్లును నిందితునిగా చేరుస్తూ పోలీసులు కేసు నమోదు చేసి చేతులు దులుపుకోవటం పలు విమర్శలకు దారి తీస్తోంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 50కి పైగా బ్లాక్ స్పాట్‌లు ఉన్నట్లు అధికార యంత్రాంగం చెపుతోంది. ఈ ప్రాంతాలపై ప్రమాదాలకు తీసుకున్న చర్యలు శూన్యమని జరుగుతున్న ప్రమాదాలు దర్పణం పడుతోంది. హైవే పెట్రోలింగ్ వ్యవస్థ అలంకార ప్రాయంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జాతీయ రహదారులకు సమీపంలో డ్రైవర్లకు విశ్రాంత గదులు, మరుగుదొడ్ల నిర్వహణ వంటివి పూర్తిగా నేతి బీర చందంలా మారాయి. ఫలితంగా భారీ వాహనాలు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసి డ్రైవర్లు విశ్రాంతి తీసుకోవటం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు కళ్లు తెరిచి ప్రమాదాల నియంత్రణకు చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

జనసైనికుల్లో నూతనోత్సాహం

జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లాలో నిర్వహించిన సభ ఆ పార్టీ శ్రేణులలో నూతనోత్సాహాన్ని నింపింది. జిల్లాలోని జనసేన కార్యకర్తలతో పాటు ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు అభిమానులు చిత్రాడకు చేరుకోవటంతో సభా ప్రాంగణం కిటకిటలాడింది. అక్కడక్కడా కొన్ని చెదరుమదురు ఘటనలు మినహా ఆద్యంతం సభ సజావుగా సాగింది. పవన్ కల్యాణ్ ప్రసంగం ఆద్యంతం ఆత్మస్తుతి పరనింద అన్నట్లుగా సాగిందనే విమర్శలు విన్పించాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు గడిచినా కీలక హామీలు ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదు. కొత్త పరిశ్రమల ఏర్పాటు ఊసేలేదు. ఈ సమస్యల ప్రస్తావన, పరిష్కారానికి తన చొరవ గురించి ప్రస్తావించలేదు. కేవలం ఆ పార్టీ 11 సంవత్సరాల ప్రస్తానాన్ని, ఎదుర్కొన్న ఒడిదుడుకులను వివరించి మమ అనిపించారు. మరో వైపు పవన్ కల్యాణ్ అభిమానులకు ఎప్పటిలానే నిరాశ తప్పలేదు. కార్యకర్తలతో పాటు కొంత మంది నియోజక వర్గ నేతలకు సైతం అధినేతను కలిసే అవకాశం లభించకపోటం విమర్శలకు దారి తీస్తోంది.



సిపిఎం ప్రజా చైతన్య యాత్రలు

సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలు ప్రజా సమస్యలు వింటూ ముందుకు సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లా కేంద్రమైన కాకినాడలో గత వారంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొని ప్రజా చైతన్య యాత్ర ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గత వారంలో రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు ఇంటి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుస్తున్నాయి. ఈ సందర్భంగా ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఒకొక్కటిగా వివరిస్తున్నారు. నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీలను సైతం విస్మరించిదంటూ ఏకరువు పెడుతున్నారు. నిరసనగా తమ గళాన్ని విన్పిస్తున్నారు.

దాడుల నివారణకు పోరాటాలే శరణ్యం

ప్రజాశక్తి - గండేపల్లి


సమావేశంలో మాట్లాడుతున్న బేబీరాణి

శ్రామిక మహిళలపై దాడులను అరికట్టాలంటే మహిళలందరూ ఏకతాటిపై పోరాటాలు సాగించాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జి.బేబీరాణి అన్నారు శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై అనేక దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని అన్నారు. చట్టాలు ఉన్నా వాటిని అమలు చేయకపోవడంతోనే ఈ దాడులు సాగుతున్నాయని అన్నారు. ఐక్య పోరాటాలతో చట్టాల అమలుకు ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ, ఆశ, మిడ్ డే మీల్ కార్మికులు, విఒఎలు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు సమాన పనికి సమాన వేతనం కల్పించకుండా అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని విమర్శించారు పని చేసే చోట లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలని డిమాండ్ చేశారు. చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆమె కోరారు. శ్రామిక మహిళలు పనిచేస్తున్న రంగాలతో పాటు జీడిపప్పు, రొయ్యలు పరిశ్రమలో పనిచేస్తున్న మహిళలకు రక్షణ సౌకర్యాలు కల్పించాలని, కనీస వేతనాలు చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రావతి, కె.సత్తిరాజు, పద్మ, అమ్మాణి పాల్గొన్నారు.

దోమల నిలయంగా కాకినాడ

ప్రజాశక్తి - కాకినాడ


ప్రజాచైతన్యయాత్రలో ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం బృందం

కాకినాడ నగరం దోమలకు నిలయంగా మారిపోతుందని సిపిఎం నాయకులు అన్నారు. శనివారం జగన్నాథపురం ముత్తానగర్ ప్రాంతంలో సిపిఎం ప్రజాచైతన్య యాత్ర జరిగింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలు సిపిఎం బృందానికి పలు సమస్యలను వివరించారు. దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దోమల నివారణకు ఖర్చు పెరిగిపోతుందన్నారు. గతంలో మున్సిపాలిటీ దోమల నివారణ మందు పిచికారీ చేసేవారని, ఇటీవల చేయడం లేదని వివరించారు. పెన్షన్లు, గృహ నిర్మాణాలకు రుణాలు మంజూరు చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ నగర పాలక సంస్థ అధికారులు ఉదయం పూట మెయిన్ రోడ్‌లలో పర్యటించే కన్నా సాయంత్రం పూట పేటల్లో పర్యటించాలని కోరారు. చెత్త సేకరణతో పాటు, డ్రెయినేజీల్లో పూడికలు తీయించడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో కొన్ని సమయాల్లో మంచినీరు కలుషితంగా సరఫరా అవుతుందని, మంచినీటి సరఫరా లో కలుషితం అరికట్టే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, టి.రాణి, తదితరులు పాల్గొన్నారు.

ఫిష్ మార్కెట్ తరలించేందుకు ఆమోదం

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం గ్రామ పంచాయతీ పరిధిలో రావి చెట్టు సెంటర్ వద్ద నిర్వహిస్తున్న మీట్ అండ్ ఫిష్ మార్కెట్‌ను తరలిం చేందుకు పంచాయతీ పాలకవర్గం ఆమోదించింది. శనివారం పంచా యతీ కార్యాలయంలో సర్పంచ్ ఎస్.కుమార్ రాజా అధ్యక్షతన పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కార్యదర్శి చక్రవర్తి పాలన మరియు వివిధ అభివృద్ధి నిర్మాణ పనులకు సంబంధించి 19 అంశాలను సభ్యుల ఆమోదం వరకు ప్రవేశపెట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్తగా నిర్మించే ఆటోనగర్ వద్దకు సాధ్యమైనంత త్వరగా మీట్ అండ్ ఫిష్ మార్కెట్‌ను తరలించాలని నిర్ణయించారు. పాత బస్టాండ్ వద్ద నిరుపయోగంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ ఒకటి మరియు 2 అంతస్తుల నిర్మాణం ద్వారా ఆదాయం పెంచేందుకు వ్యాపారం నిర్వహించుకునే హక్కునకు చేపట్టిన షీల్డ్ టెండర్ ప్రకటనలో తక్కువ రేటు రావడంతో సదరు అంశాన్ని రద్దు పరచి ఆదాయం పెంచేందుకు ఒక ఔత్సాహికుడు పెట్టుకుని దరఖాస్తును పరిశీలించి జిల్లా పంచాయతీ అధికారుల ఆమోదం కొరకు తీర్మానించారు. గ్రామంలో నీటి ఎద్దడి నివారణ కోసం జలజీవన్ మిషన్ ద్వారా వివిధ ప్రాంతాల్లో బోర్లు ఏర్పాటుకు గల అంశాన్ని ఆమోదించారు. పంచాయతీకి అవసరమగు పారిశుధ్య, ఎలక్ట్రికల్ వాటర్ సప్లై, స్టేషనరీ సామాగ్రి కొనుగోలుకు టెండర్లు పిలిచేందుకు ఆమోదించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ వెంకన్న, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వల్లభ స్వామికి రూ.4.01 లక్షలు ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.4.01 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ కార్య నిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ దర్శనం టికెట్ల ద్వారా రూ.2,15,030, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,51,947, కేశఖండన ద్వారా రూ.6,960, తులాభారం ద్వారా రూ.500, లడ్డు ప్రసాదం ద్వారా రూ.27,150 వెరసి రూ.4,01,587 ఆదాయం సమకూరిందని తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహార, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పెద్దింటి పురుషోత్త మాచార్యులు పెద్దింటి నారాయణాచార్యులు, సిబ్బంది, పాల్గొన్నారు.

రెల్లిలకు న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి - పిఠాపురం

ఉషా మెహ్రా కమిషన్, రామచంద్ర కమిటీ సిఫార్సులను అమలు చేసి రెల్లిలకు న్యాయం చేయాలని రెల్లి కుల సంక్షేమ సేవా సంఘం నాయకులు ఎంఎల్‌సి హరిప్రసాద్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్రబాబులన కోరారు. ఈ సందర్భంగా సంఘం కన్వీనర్ అల్లం కిషోర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఎస్‌సి రిజర్వేషన్లో రెల్లి కులస్తులకు ప్రభుత్వాలు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. విద్యలో, ఉపాధిలో, ఉద్యోగ ఆర్థిక అభివృద్ధిలో రెల్లి కులస్తులు వెనుకబడ్డారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్యాకేజీతో పాటు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించేందుకు వీలుగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కృషి చేసేలా తమ కోర్కెలను ఆయన దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

జనసేన సభ జయప్రదంపై హర్షం

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని చిత్రాడ గ్రామంలో జరిగిన జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవ జయకేతనం సభ జయప్రదం అయిందని పలువురు జనసేన నాయకులు అన్నారు. శనివారం మండలంలోని కుమారపురంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. తొలుత పారిశుధ్య కార్మికులను జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు, ఎంఎల్‌సి హరిప్రసాద్ సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆవిర్భావ సభ ఘనంగా జరిగిందని, రాష్ట్రమే కాక దేశం మొత్తం సభ వైపు చూసిందన్నారు. గతంలో చేసుకున్న 11 ఆవిర్భావ దినోత్సవ సభలు అధికారంలో లేనప్పుడు చేసుకున్నామని తెలిపారు. వైసిపిని 11 సీట్లకే పరిమితం చేసిన ఘనత పవన్ కల్యాణ్‌కే దక్కిందన్నారు. పలువురు వైసిపి నాయకులు జనసేన వైపు చూస్తున్నారని, జనసేన స్థాపన నుంచి అండగా నిలబడిన జన సైనికులకు ఇబ్బందులు తలెత్తకుండా అడుగులు వేస్తున్నామని లేకుంటే వైసిపి ఈపాటికే ఖాళీ అయ్యేదన్నారు. పవన్ పని తీరు నచ్చి పిఠాపురం మాజీ ఎంఎల్‌ఎ పెండెం దొరబాబు జనసేనలో చేరారన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ పిఠాపురం నియోజవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి, టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ నాయకులు పివిఎస్ఎస్.రాజు, పంచకర్ల సందీప్, చల్లా లక్ష్మీ, సిహెచ్.సతీష్‌కుమార్, డాక్టర్ పిల్లా శ్రీధర్, డాక్టర్ వరలక్ష్మీ, ఎస్.సురేష్, డి.లాజర్‌బాబు, శివశంకర్, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో ఎస్‌పి పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట


భీమేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న ఎస్‌పి కుటుంబ సభ్యులు

భీమేశ్వర ఆలయంలో ఎస్‌పి బిందుమాధవ్ కుటుంబం శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ కార్య నిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. భీమేశ్వర స్వామిని బాలా త్రిపుర సుందరి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఎస్‌పి కుటుంబానికి ప్రసాదాలను అందజేశారు. అనంతరం డిఎస్‌పి డి.శ్రీహరిరాజు, సిఐ కృష్ణభగవాన్‌లతో ఎస్‌పి మాట్లాడారు. మహాశివరాత్రి ఉత్సవాలు, సమయంలోను, చిత్రాడలో జరిగిన జనసేన ఆవిర్భావ దినోత్సవ సభల్లో విజయవంతంగా బందోబస్తు నిర్వహించిన సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు, పెద్దాపురం ఎస్ఐ మౌనిక పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

ప్రజాశక్తి - కిర్లంపూడి

స్థానిక వెంకటేశ్వర స్వామి ఏడవ కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. పెంటకోట నాగబాబు, సత్యవేణి దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మాజీ ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు జ్యోతుల చంటిబాబును, ముద్రగడగిరి బాబు పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చంటిబాబు, గిరిబాబు ప్రారంభించారు.

విఆర్‌ఒకు షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని నీలాద్రిరావుపేట విఆర్ఒ ఆకుమూర్తి దిలీప్‌కుమార్‌కు తహశీల్దార్ శ్రీనివాస్ షోకాజ్ నోటీసు ఇచ్చారు. విధుల్లో నిర్లక్ష్యం వివరించడంతోపాటు, కొంతకాలంగా విధులకు హజరు కాకపోవడం, పింఛన్ పంపిణీలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై విఆర్‌ఒకు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. ఆయన స్థానంలో మరొకరిని ఇన్‌ఛార్జ్‌గా నియమించనున్నట్లు తహశీల్దార్ తెలిపారు.

ధర్మవరంలో తాగునీటి కష్టాలు..

ప్రజాశక్తి - ప్రత్తిపాడు


మరమ్మతులకు నోచుకోని పైపులైన్

మండలంలోని ధర్మవరం గ్రామంలో ప్రజలకు తగునీటి కష్టాలు తప్పడం లేదు. గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు పైపులైన్లు వారానికి రెండుసార్లు మరమ్మతులకు గురవుతుంది. దీంతో గ్రామ ప్రజలకు అవసరమైన రీతిలో తాగునీరు సరఫరా కావడం లేదు. ఈ ట్యాంకుకు సిమెంట్ పైపులను అండర్ గ్రౌండ్‌లో లైన్‌ను 2001లో వేశారు. అప్పటి నుంచి పైపు లైన్‌ను మార్చకపోవడంతో తరచూ మరమ్మతుల భారిన పడుతోంది. సిమెంట్ పైపులు భూమిలో పగిలిపోవడంతో ప్రజలకు కలుషిత నీరు సరఫరా అవుతోందని వార్డు సభ్యులు గొనగాని పద్మ ఆరోపించారు. తాగునీటి సమస్యపై పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చశారు. తక్షణమే పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటిని సరఫరా చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నిరుపయోగంగా ఉన్న బోరును వినియోగంలోకి తేవాలని కోరారు.

సమస్యలపై ప్రజాప్రతినిధుల ఏకరువు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలంటూ ప్రజాప్రతినిధులు ఏకరువు పెట్టారు. శనివారం మండల పరిషత్ పాలకమండలి సమావేశం ఎంపిపి అరిగెల అచ్చియమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు గత ప్రభుత్వంలో స్లాబ్ వరకు నిర్మించుకున్న గృహాలకు బిల్లులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై హౌసింగ్ ఎఇ రాజేశ్వరి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామన్నారు. చెందుర్తి గ్రామంలో ఆశాలు ఫీల్డ్‌లో పనిచేయడం లేదని, సబ్ సెంటర్‌కి వెళ్ళిన అందుబాటులో ఉండడం లేదని, చిన జగ్గంపేటలో సారా ఏరులై పారుతుందని పలువురు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తహశీల్దార్ కెవి.సత్యనారాయణ మాట్లాడుతూ రీ సర్వేలో నమోదు చేసుకున్న దరఖాస్తుల్లో 650 పరిష్కరించాల్సి ఉందన్నారు. త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి పలు ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకాకపోవడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత అధికారులకు తెలియచేస్తామని ఎంపిడిఒ స్వప్న తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి బత్తిన మంగ ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.